సాక్షి ప్రకాశం

గురువారం । 13 । మార్చి । 2025



ప్రజల కోసం నిలబడతాం.. కలబడతాం

ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజల కోసం నిలబడతామని చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు.
- 8లో..



మంచంపట్టిన కుంచేపల్లి

పొదిలి మండలం కుంచేపల్లి ఎస్సీ కాలనీలో పారిశుధ్యం లోపించడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరపీడితులు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

గురువారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 25
శుక్రవారం	సహారి
ఉదయం	గం 4 : 58

న్యూస్‌రీల్

15న జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

గిద్దలూరు రూరల్: మండలంలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఈదుల పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో గెలుపొందిన రెండు పండ్ల విభాగం ఎడ్లకు మొదటి నుంచి నాలుగు బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారన్నారు. 16వ తేదీ సీనియర్స్ విభాగం ఎడ్ల పోటీలో గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.1,11,111, రూ.77.777, రూ.55,555, రూ.33,333, రూ.22,222, రూ.11,111లను అందిస్తారని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9866432566 సెల్ నంబరును సంప్రదించాల్సిందిగా వారు కోరారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



ఐద్వా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకురాలు అంజనీదేవి

ఒంగోలు టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. బుధవారం నగరంలోని ఎల్బీజీ భవనంలో ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకురాలు వై. అంజనీ దేవి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి ప్రభుత్వాలే మద్దతు పలకడం సిగ్గుచేటన్నారు. మహిళలు మరింతగా ఐక్య ఉద్యమాలు చేయాలని కోరారు. దేశంలోని మహిళల హక్కుల కోసం ఐద్వా అనేక పోరాటాలు చేసిందని, ఐద్వా పోరాటాల ఫలితంగా నేక చట్టాలు, హక్కులను సాధించుకుందని చెప్పారు. రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఇచ్చిందని, బీజేపీ పాలనలో మహిళల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ నాగూర్ బీ, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, రాజేశ్వరి, పెద్ద గోవిందమ్మ, ఇంద్రజ్యోతి పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల పునఃపరిశీలన

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పునః పరిశీలన ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి బుధవారం ఉదయం జిల్లాలో జరుగుతున్న నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పునఃపరిశీలన ప్రక్రియ, పురోగతిపై మండలాల వారీగా రెవెన్యూ అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా పూర్తిస్థాయిలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పునః పరిశీలన జరగాలన్నారు. ఈ ప్రక్రియపై సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, సత్యనారాయణ, తహశీల్దార్లు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



యువత పోరు ర్యాలీకి హాజరైన విద్యార్థులు, యువత, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు



నినదించి.. నిలదీసి..


సంక్షేమ పథకాలను అటకెక్కించడమే కాకుండా తమ భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందంటూ విద్యార్థులు, యువత తిరుగుబావుటా ఎగురవేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై గర్జించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రభుత్వం తుంగలోకి తొక్కిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ''యువత పోరు'' కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున యువత తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.



ర్యాలీలో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, తాటిపర్తి చంద్రశేఖర్, ఆదిమూలపు సురేష్, నాగార్జునరెడ్డి, చుండూరి, జంకె

- కూటమి నిర్లక్ష్యంపై యువత గర్జన..
- అభ్యర్థుల భవితను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి
- 'యువత పోరు'కు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు, కార్యకర్తలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ/ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ అటకెక్కించిందని, వారి భవిష్యత్‌ను కాలరాస్తోందని ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలులో బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. తొలుత డీఆర్ఆర్ మున్సిపల్ స్కూల్ నుంచి భారీ ర్యాలీగా బయలు దేరారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పార్టీ సీనియర్ నాయకులు మాదాసి వెంకయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లోకి వీరు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ప్రధానగేట్లన్నీ మూసివేశారు.



ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలకులు విద్యార్థులకు, యువతకు చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమర శంఖాన్ని పూరించిందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం గోరుముద్ద, వసతిదీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి వంటి పథకాలు అందించి అండగా నిలిచారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్, తల్లికి వందనం, వసతి దీవెన పథకాలు అమలు చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు.



యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్క ప్రజా సంక్షేమ పథకాన్ని అమలు చేయలేని, దద్దమ్మ పాలకులుగా మిగిలిపోయారని ధ్వజమెత్తారు. విద్యాశాఖను గాలికి వదిలేసి సంబంధిత శాఖ మంత్రి విదేశాల్లో జల్సాగా తిరుగుతున్నాడని విమర్శించారు. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రానికి వచ్చే కంపెనీలు పారిపోతున్నాయన్నారు. విద్యార్థులకు రావాల్సిన రూ.4600 కోట్ల బకాయిలు ఇచ్చేందుకు ముగ్గురు పెద్ద మనుషులకు చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏదో చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకుల చేతకాని తనం చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మార్కాపురంను జిల్లా చేస్తామని హామీ ఇచ్చి దానిని అమలు చేయకుండా చంద్రబాబు నిస్సిగ్గుగా జిల్లాకు వచ్చి వెళ్లారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన మహిళను నీకు ఓటు ఉందా అని ప్రశ్నించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. నిరుద్యోగ భృతికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం యువతను మోసగించడమేనని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించి కూటమి నేతలను నిలదీయాలని, గ్రామాల్లో అభివృద్ధికి పాటుపడని ఎమ్మెల్యేలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు విషయంలో మాట మార్చిన నాయకులపై 420 కేసు నమోదు చేయాలన్నారు.



మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు డీఎస్సీ ఫైలుపై చేసిన తొలిసంతకం ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం సిగ్గు చేటన్నారు. 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని యువతలో ఆశలు రేపి ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించారన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలతో 2500 మెడికల్ సీట్లను రాష్ట్రం కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నినాదాలు చేస్తున్న యువకులు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం ద్వారా సీఎం చంద్రబాబు విద్యార్థులను మోసం చేశారని విమర్శించారు. ప్రతి మూడు నెలలకొకసారి రూ.700 కోట్ల ప్రకారం ఏడాదికి రూ.2100 కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. వసతి దీవెనకు రూ.1100 కోట్లు ఇవ్వాలని, అయితే బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి ఒట్టి చేతులు చూపారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజున విద్యార్థులకు అండగా పోరాటం చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చంద్రబాబు పాలనలో యువత అనేక ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, ఒకవేళ ఇవ్వలేకపోతే అప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మార్కాపురంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను నిలిపేసి నిరుపేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేసిందని ధ్వజమెత్తారు.



ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి రూ.6 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, ఇప్పటి వరకు 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం చంద్రబాబు సాక్షాత్తు అసెంబ్లీలోనే అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఖరితో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు, యువకులు రోడ్లపైకి వస్తున్నారని చెప్పారు.

కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, ఒంగోలు మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, యూత్ వింగ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మల్లిశెట్టి దేవా, నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, ఫ్లోర్‌లీడర్ ఇమ్రాన్‌ఖాన్, కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్ వెన్నపూస కుమారి, పేరం ప్రసన్న, బడుగు ఇందిర, సీనియర్ నాయకులు బొట్ల రామారావు, దుంపా చెంచిరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ సాగరు, నాగూరు, రషీదా పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించండి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. మార్కెట్లు, దుకాణాల వద్ద ఇందుకు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని చెప్పారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా చర్చించారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని సమర్థంగా నిషేధించాలనే ఇతివృత్తంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధులను. ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంతోపాటు వాటికి ప్రత్యామ్నాయంగా క్లాత్, జ్యూట్ సంచులపై ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్నందున శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల లక్ష్యాలు–పురోగతి, జిల్లాల వారీగా ప్రత్యేక అంశాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లు తయారు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఆయా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పెన్షన్ల పంపిణీ, రెవెన్యూ మ్యుటేషన్లు కరెక్షన్లు, పారిశుధ్యం, ప్రతి రోజు చెత్త సేకరణ, ఆస్పత్రులు, దేవాలయాల్లో ప్రజలకు అందించే సేవల విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వర్లు, సూరిబాబు, డీపీవో వెంకట నాయుడు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఏపీడీ వందర్ మాన్, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాష, విద్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వెలుగొండకు బ్రహ్మోత్సవ కళ

● నేడు అంకురార్పణ.. రేపు రాత్రికి కళ్యాణం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గురువారం అంకురార్పణతో మొదలవుతున్న ఉత్సవాలు ఈ నెల 25న పూర్ణాహుతి, చక్రతీర్థం, వసంతోత్సవంతో ముగియనున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

13న అంకురార్పణ, 14న ధ్వజారోహణం, రాత్రికి శ్రీవారి కళ్యాణం, 15న చంద్రవాహనం, 16న వ్యాళి వాహనం, 17న సింహ వాహనం, 18న హంస వాహనం, 19న శేష వాహనం, 20న హనుమంత వాహనం, 21న గరుడోత్సవం, 22న గజోత్సవం, తిరునాళ్ల, ప్రభలు, 23న రథోత్సవం, 24న దీపోత్సవం, అశ్వవాహనం, 25న ధ్వజ అవరోహణం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేవారు కమిటీ వారికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి


ప్రమాదంలో మృతి చెందిన దుప్పి

దర్శి: గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందింది. ఈ ఘటన పట్టణంలోని ఎంవీఐ కార్యాలయం సమీపంలో బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తెల్లవారుజామున దుప్పి రోడ్డుపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి దుప్పిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దుప్పి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌బీఓ అమర తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- 115 కేసులకు సంబంధించి రూ.5.92 లక్షల జరిమానా

నాగులుప్పలపాడు: ఒంగోలు డివిజన్ పరిధిలోని నాగులుప్పలపాడు మండలంలోని విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయకృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విద్యుత్ అధికారులు 34 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టగా అదనపు లోడు వినియోగిస్తున్న 106 సర్వీసులకు గాను రూ.5,31,600, విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒక సర్వీసుకు రూ.10 వేలు, గృహాల కింద విద్యుత్ కనెక్షన్ తీసుకొని వ్యాపారాలకు వినియోగిస్తున్న 8 సర్వీసులకు రూ.51 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో డీపీఈ హైమావతి, ఈఈ హరిబాబు, డీఈ శ్రీకాంత్, రంగారావు, ఏఈ రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

దైవచింతన పేరుతో రూ.కోటికి టోకరా

మద్దిపాడు: దైవచింతన పేరుతో రూ.కోటికి పైగా ఒక మహిళ టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిపాడుకు చెందిన పురాలశెట్టి ఆంజనేయులు సిటీ కేబుల్ నిర్వహిస్తున్నాడు. వారి ఇంట్లో సుద్దపల్లి రాజేశ్వరి అనే మహిళ రెండేళ్లుగా బాడుగకు ఉంటుంది. ఈ క్రమంలో ఆంజనేయులు భార్య లక్ష్మితో సన్నిహితంగా ఉంటూ ఆధ్యాత్మిక చింతన పేరుతో పూజలు, దైవ సంబంధిత మాటలు చెప్పేది. ఈ క్రమంలో తనకు సుమిత్ర అను దైవంశ సంభూతురాలితో పరిచయం ఉన్నట్లు మాయమాటలు చెప్పింది. అనంతరం బంగారం ఇంట్లో ఉంటే అశుభం కలుగుతుందని చెప్పి లక్ష్మీ వద్ద ఉన్న 110 సవర్ల బంగారు ఆభరణాలను మాయ మాటలతో తీసుకొని పలు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో రూ.35 లక్షలకు తాకట్టు పెట్టింది. దీంతో పాటు ఆమె వద్ద రూ.11.50 లక్షల నగదును తీసుకుంది. దీనిపై ఆంజనేయులు పలుమార్లు రాజేశ్వరిని నగదు ఇవ్వమలని కోరగా..ఆమె చేతులెత్తేయడంతో ఆంజనేయులు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల కోసం నిలబడతాం.. కలబడతాం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా 15వ ఆవిర్భావ దినోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జులు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ:

ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ ప్రజల కోసం చివరిదాకా నిలబడతామని, ప్రజా సంక్షేమం కోసం ఎవరితోనైనా కలబడతామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు మాదాసి వెంకయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్‌తో కలిసి పార్టీ జిల్లా కార్యాలయంలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల జయజయధ్వానాల మధ్య జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని, పోరాటాలు, ఉద్యమాలు పార్టీకి కొత్త కాదని పేర్కొన్నారు. ఆది నుంచి అన్ని రకాల ఆటుపోట్లను ధీటుగా ఎదుర్కొని ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు అండగా నిలబడుతుందని చెప్పారు.

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ తొలి నుంచీ పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నిరుపేద యువకులకు న్యాయం చేసేందుకు పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున పోరాటం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఎదో ఒక సంక్షేమ పథకాన్ని అందజేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద బిడ్డల చదువుల కోసం ఏటా రూ.15 వేల రూపాయలు అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే సచివాయాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది యువకులకు ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరూపాన్నే మార్చివేశారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు ఎంపీపీ గాయం సావిత్రి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బడుగు ఇందిర, పార్టీ రాష్ట్ర సెక్రటరీ భూమిరెడ్డి రమణమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు వాణి, సాధం విజయలక్ష్మి, బత్తుల ప్రమీల, వి.మాధవి, బి.మేరీకుమారి, రమణమ్మ, షేక్ అఫ్సార్, గోనుకుంట రజిని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, నేతలు

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె కూల్చివేత

- ఆవిష్కరించిన కొద్దిసేపటికే హైవే అధికారుల అత్యుత్సాహం
- పక్కనే 20 ఏళ్ల నుంచి ఉన్న కార్మిక సంఘాల నాలుగు జెండాల తొలగింపు
- టీడీపీ కటౌట్, మరికొన్ని జెండాల జోలికి వెళ్లని వైనం
- అక్కడే జెండాలు ఏర్పాటు చేస్తామన్న కార్మిక సంఘాల నాయకులు


వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను తొలగిస్తున్న హైవే సిబ్బంది



సంఘటనా స్థలంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కంభం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున టీడీపీ నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంభంలోని కందులాపురం సెంటర్‌లో ఆ పార్టీ నేతలు ఉదయం ఆవిష్కరించిన జెండాను మధ్యాహ్నానికి తొలగించి, సిమెంట్ దిమ్మెను ధ్వంసం చేయించారు. టీడీపీ నేతల కక్ష సాధింపు చర్యల్లో హైవే అధికారులు, పోలీసులు భాగస్వాములు కావడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికీ ఆటంకం కలిగించని చోట, ఏళ్ల తరబడి అక్కడే ఉన్న జెండా దిమ్మెను పోలీసులను వెంటబెట్టుకొచ్చి మరీ హైవే అధికారులు ధ్వంసం చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పార్టీ ఆవిర్భావ వేడుక ముగియగానే యువత పోరు ధర్నాలో పాల్గొనేందుకు నాయకులంతా ఒంగోలు తరలి వెళ్లగా.. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పోలీసులు, హైవే అధికారులు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ జెండా, పక్కనే ఉన్న సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ జెండాలను గడ్డపారలతో ధ్వంసం చేశారు. ఈ తతంగాన్ని పోలీస్ సిబ్బంది డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం గమనార్హం. జెండాలు ఎందుకు తొలగిస్తున్నారని స్థానికులు ప్రశ్నించగా «ఇది హైవే స్థలం. మా పైఅధికారులు చెప్పారు» అని బదులిచ్చారు. వైఎస్సార్ సీపీ జెండా ఉన్న ప్రాంతంలో మొత్తం 7 జెండాలు, టీడీపీ భారీ కటౌట్ ఉండగా వైఎస్సార్ సీపీ జెండాను, మరో నాలుగింటిని మాత్రమే తొలగించడం కక్ష సాధింపులో భాగమేనని విమర్శలు వ్యక్తమయ్యాయి. టీడీపీ కటౌట్, మిగిలిన జెండాలను తొలగించకుండా వదిలేయడంలో ఆంతర్యమేంటో హైవే అధికారులు స్పష్టం చేయాలని కార్మిక సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

కార్మిక సంఘాల మనోభావాలు దెబ్బతీశారు

సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 20 ఏళ్ల క్రితం ఆవిష్కరించిన జెండాలను ఎలాంటి సమాచారం లేకుండా తొలగించి తమ మనోభావాలు దెబ్బతీశారని ఆయా సంఘాల నాయకులు మండిపడ్డారు. «తొలగించిన జెండాలను గురువారం ఉదయం అక్కడే మళ్లీ ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తాం» అని స్పష్టం చేశారు. ఎవరైనా అడ్డుకుంటే ఆందోళనకు దిగుతామని కార్మిక సంఘాల నాయకులు అన్వర్, రోశయ్య, సిద్దారెడ్డి, గుర్రప్ప, ఖాజావళి, కొత్తూరు తదితరులు హెచ్చరించారు.

దుర్మార్గమైన చర్య



వైఎస్సార్ సీపీ జెండాను తొలగించడం దుర్మార్గమైన చర్య. ఎవరి మెప్పు పొందడం కోసం హైవే అధికారులు ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినట్టుగా ఉంది. మంగళవారం రాత్రి జెండా ఏర్పాటు చేస్తున్న సమయంలో ఓ దళిత ఎంపీటీసీని దుర్భాషలాడారు. ఆ విషయంపై పోలీసుల ఫిర్యాదు చేశాం. హైవే మొత్తం ఇరువైపులా ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులకు వైఎస్సార్ సీపీ జెండా కనిపించే సరికి ఎక్కడా లేని రూల్స్, ఉద్యోగ బాధ్యతలు గుర్తుకొచ్చాయా. టీడీపీ కటౌట్ ఎందుకు తొలగించలేదు. ఎల్లకాలం ఒకే ప్రభుత్వం ఉండదని గుర్తుంచుకుంటే మంచిది.

– నెమలిదిన్నె చెన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్, కంభం

అడ్డగోలుగా చెట్ల నరికివేత!

హైవే అధికారుల తీరుపై విమర్శలు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డు పక్కన ఉన్న భారీ చింత చెట్టును నరికివేశారు. ప్లాట్లకు అడ్డుగా ఉందని జేసీబీ సహాయంతో పెకిలించి, రోడ్డుకు దూరంగా తీసుకెళ్లి ముక్కలుగా చేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హైవే అధికారులతో మాట్లాడి చెట్టును తొలగించినట్లు ప్లాట్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తులు చెప్పడం గమనార్హం. హైవే అధికారులతో మాట్లాడేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా ఫోన్ పెట్టేశారు. అడ్డగోలుగా వ్యవసాయ పొలాలను ప్లాట్లుగా మార్చేచోట భారీ చెట్లను తొలగించేందుకు హైవే అధికారులు ఎలా అనుమతిస్తారని స్థానికులు ప్రశ్నించారు.


హైవే పక్కన భారీ చింతచెట్టు పెకిలించి ముక్కలు చేస్తున్న జేసీబీ

దారి చూపిస్తారా.. . ధర్నా చేయమంటారా..?


రోడ్డు పనులు అడ్డుకొని నిరసన తెలుపుతున్న రైతులు

పొదిలిరూరల్: ' మా పొలాలకు వెళ్లేందుకు దారి చూపిస్తారా..లేకా ధర్నా చేయమంటారా అంటూ మండలంలోని గోగినేనివారిపాలేనికి చెందిన రైతులు బుధవారం రహదారి పనులు అడ్డుకున్నారు. రైతుల పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని పనులను అడ్డుకున్నారు. మండలంలోని ఉప్పలపాడు, గోగినేనివారిపాలేనికి చెందిన దాదాపు 50 మంది రైతులకు చెందిన భూములు కొనుగోలు చేసిన కేఎస్ఆర్ అనే సంస్థ రహదారి పనులను చేపట్టింది. దాదాపు 53 ఎకరాల భూమిని 227 మంది రైతులు రోడ్డు నిర్మాణానికి ఇస్తే మొత్తం రూ.19 కోట్లు రైతులకు రావాల్సి ఉండగా ఇప్పటికే దాదాపు రూ.9.50 కోట్లు చెల్లించారు. ఇంకా 50 మంది రైతులకు రూ.10 కోట్లు అందాల్సి ఉంది.'అందులో గ్రానైట్ కంపెనీకు సంబంధించి రూ.6.50 కోట్లు, ఎండోమెంట్ రూ.1.50 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు కూలీలు చేసే రహదారి నిర్మాణ పనులను అడ్డుకొని నిరసన తెలియజేశారు. దీంతో నిర్వాహకులు రైతులకు సర్దిచెప్పి ఉన్నతాధికారులకు నివేదించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

శక్తి యాప్ కాల్స్‌కు తక్షణమే స్పందించాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్


శక్తి యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే వివిధ సమస్యల నుంచి బయట పడేందుకు పోలీసుల సాయం కోసం శక్తి యాప్‌కు ఫోన్లు చేస్తుంటారని, వాటికి సిబ్బంది తక్షణమే స్పందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంను బుధవారం తనిఖీ చేశారు. కంట్రోల్ రూంలో అత్యవసర సేవలను అందిస్తున్న శక్తి యాప్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్వయంగా తన ఫోన్ నుంచి వీడియా ఎస్ఓఎస్‌కు కాల్ చేసి సిబ్బంది పనితీరును, తక్షణ స్పందన పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శక్తి సిబ్బంది తక్షణమే వచ్చి కాల్ వివరాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సహాయం అందజేస్తారని తెలిపారు. సమాచారం చేరవేయడంలో ఎలాంటి జాప్యం చేసినా, నిర్లక్ష్యం వహించినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి చురుగ్గా, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఒంగోలు కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు ధర్నాను వీడియో వాల్ ద్వారా పర్యవేక్షించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐసీసీఆర్ ఎస్సై ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రోన్ కెమెరాలతో గట్టి నిఘా పెట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. మిస్సింగ్, పెండింగ్ కేసులు, హత్య కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుర్తు తెలియని మృతదేహాలు, కారణం తెలియని మరణాలు, అనుమానాస్పద మృతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపి అన్నీ కోణాల్లో దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేరాల కట్టడి, నిందితుల గుర్తింపు, చోరీ సొత్తు రికవరీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్నీ సబ్ డివిజన్ల పరిధిలో శక్తి టీంలను ఏర్పాటు చేయాలని, శక్తి యాప్‌ను రిజిస్టర్ చేయించాలని చెప్పారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలను అందించాలని చెప్పారు. గంజాయి, ట్రాన్స్‌ఫారాల చోరీ కేసుల్లో ప్రతిభ చూపిన దర్శి సీఐ రామారావు, ముండ్లమూరు ఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు మహేష్, మరియబాబు, కిరణ్ మహేష్, హోంగార్డులు ఖాసీం, ఖాసిరాజులను అభినందించి ప్రత్యేక ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్, నాగరాజు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మంచం పట్టిన కుంచేపల్లి ఎస్సీ కాలనీ


ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న గురవమ్మను 108 వద్దకు తీసుకెళ్తున్న బంధువులు


నొప్పులతో మంచం పట్టిన 10వ తరగతి విద్యార్థులు జీవమణి, వైష్ణవి


జ్వరంతో బాధపడుతున్న రేషన్ డీలర్ పాలు

- ఒక్క ఆదర్శ పాఠశాలలోనే 25 మంది విద్యార్థులకు జ్వరం
- కాలనీలోనూ మరింత మంది జ్వర పీడితులు
- దారుణంగా పారిశుధ్యం.. పట్టించుకోని అధికారులు
- నడవలేని స్థితిలో ఉన్నవారి ఇంటి వద్దకు రాని 108 వాహనం

పొదిలి రూరల్: పారిశుధ్యం లోపించడం, దోమలు విజృంభిస్తుండటంతో పొదిలి మండలంలోని కుంచేపల్లి ఎస్సీ కాలనీని వ్యాధులు చుట్టుముట్టాయి. గత వారం రోజుల నుంచి కాలనీ వాసులు టైఫాయిడ్, చికున్‌గున్యా, మలేరియా జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. కాలనీలో ఎవరిని పలకరించినా «ఒళ్లు నొప్పులు.. జ్వరం» అంటూ దీనంగా చెబుతున్న పరిస్థితి. విష జ్వరాలు సోకిన బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటుండగా.. గొంతు నొప్పి, జలుబు, పొడి దగ్గు, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు మంచం పట్టారు. పాల్ అనే రేషన్ డీలర్ కుటుంబ సభ్యులందరికీ విష జ్వరాలు సోకడంతో దాదాపు లక్ష రూపాయలు ఖర్చు చేసినట్లు వాపోయారు. కాలనీలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 64 మంది విద్యార్థులు ఉండగా 25 మందికి విష జ్వరాలు సోకి బడికి రావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

నేను రాను.. మీకు చేతనైంది చేసుకో..

ఎస్సీ కాలనీలో జ్వర పీడితులు కొందరు అతి కష్టం మీద ఆస్పత్రికి వెళ్తున్నారు. వయసు పైబడిన వారు, నడవలేని స్థితిలో ఉన్న కొందరు బుధవారం ఉదయం 108 వాహనానికి ఫోన్ చేయగా కాలనీ మెయిన్ రోడ్డు వరకు వచ్చారు. గురవమ్మ అనే మహిళ నడవలేక ఇబ్బంది పడుతుండగా ఇంటి దగ్గరకు రమ్మని పిలిచారు. రావడం కుదరదని 108 సిబ్బంది చెప్పడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. «మీకు చేతనైంది చేసుకోండి.. సంతకం పెడితే వెళ్లిపోతాం» తెగేసి చెప్పడంతో చేసేది లేక గురవమ్మను ఎత్తుకుని 108 వాహనం దగ్గరకు తీసుకువెళ్లారు. 108 సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఇదిలా ఉండగా వారం రోజుల నుంచి కాలనీ వైపు రాని వైద్య సిబ్బంది బుధవారం హడావుడిగా వచ్చి మొక్కుబడిగా వైద్య శిబిరం నిర్వహించారు.

పారిశుధ్యంపై ముందస్తు చర్యలేవి?

కాలనీలో పారిశుధ్యాన్ని గాలికొదిలేయడం వల్లే దోమలు విజృంభించి జ్వరాల బారిన పడినట్లు స్థానిక పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగు దోమ విజృంభణకు కారణమవుతోంది. వీధుల్లో చెత్తా చెదారం, పరిసరాలు అధ్వానంగా ఉండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. కాలనీ మొత్తం జ్వరాల బారిన పడి అల్లాడుతుంటే కనీసం బ్లీచింగ్ చల్లించకుండా, ఫాగింగ్ చేయించకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి చోద్యం చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు

పోలీసు వాహనాలను కండీషన్‌లో ఉంచాలి

ఒంగోలు టౌన్: శాంతి భద్రతలను కాపాడడంలో పోలీస్ వాహనాలు ఎంతో ముఖ్యమని, అవి కండీషన్‌లో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగంలోని అన్నీ రకాల వాహనాలను, జిల్లాలోని అన్నీ పోలీస్‌స్టేషన్లకు కేటాయించిన వాహనాల పనితీరును, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వాహనాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అత్యవసర హారన్, పోలీసు స్టిక్కర్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు.